క్రమ శిక్షణలో ఆదర్శం.. మా మంచి బడి

- ఎర్రగుంట్ల ఉన్నత పాఠశాల నుంచి ఏటా ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక
- తెలుగు, ఆంగ్ల మధ్యమాల్లో బోధన

ఎర్రగుంట్ల : పట్టణంలో 1950లో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రారంభమైంది. ఇక్కడ క్రమశిక్షణతో పాటు ఉత్తమ బోధన అందించేందుకు ఉపాధ్యాయులు ముందు ఉంటున్నారు. ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈ ఏడాది కూడా ఇప్పటి వరకు 150 మందిపైగా విద్యార్థులు పాఠశాలలో ప్రవేశాలు పొందారు. ప్రస్తుతం తెలుగు, ఆంగ్లమాధ్యమాలలో సుమారు 800లకు పైగానే విద్యార్థులు ఉన్నారు. రామాంజనేయరెడ్డి ప్రధానోపాధ్యాయులుగా వ్యవహరిస్తున్నారు. పాఠశాలలో విద్యాబోధన, పిల్ల అభ్యున్నతికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. కార్పొరేటు స్థాయిలో బోధిస్తుండటంతో చుట్టపక్కల గ్రామాల ప్రజలు తమ పిల్లలను ఎర్రగుంట్ల పాఠశాల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఏటా పదిలో ఉత్తమ ఫలితాలు..

ఏటా పదిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. 2023–24 195 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 149 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అదే ఏడాదిలో ఎం.యోగేశ్వర్ 561 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. సుమారు 20 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగానే సాధించారు. గతేడాది వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యలోని కాక క్రీడల్లోనూ పాఠశాల విద్యార్థులు నైపుణ్యత చూపుతున్నారు. హాకీ, ఫుట్ బాల్, హ్యాండ్‌బాల్, పోటీలలో జాతీయస్థాయిలో పతకాలు సాధించారు. విజయవాడ, నెల్లూరులోని క్రీడా ఆకాడమీల్లో కూడా ప్రవేశాలు పొందారు. అంతేకాక వృత్తి పరమైన కోర్సులు టైలరింగ్, హౌస్ వైరింగ్, ఐటీ ఎలక్ట్రికల్, కంప్యూటర్ విద్యను కూడా అందిస్తున్నారు. ఈ పాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థులు జవహర్‌రెడ్డి గత ప్రభుత్వంలో సీఎస్‌గా పనిచేశారు. మాజీ మంత్రి మైసురారెడ్డి, సాక్షి మీడియా గ్రూపు డైరెక్టర్ వై.ఈశ్వరప్రసాద్‌రెడ్డిలతో పాటు చాలా మంది ఈ పాఠశాలలోనే చదవి ఉన్నత విద్యను అభ్యసించారు.



ఎర్రగుంట్లలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల

ప్రతి ఏటా దాతలు విద్యార్థులకు నగదు పారితోషకాలు

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేయూతనందిస్తున్నారు. పరీక్షలలో మంచి మార్కులు పొందిన వారికి బహుమతులు అందజేస్తున్నారు. ఏడాది పదిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి సాక్షి మీడియా గ్రూపు డైరెక్టర్ వై.ఈశ్వరప్రసాద్‌రెడ్డి రూ.10116 అందిస్తున్నారు. స్థానిక వారాసి గ్యాస్ ఏజేన్సీ మొద్దటి ఐదు స్థానాలలో నిలిచిన విద్యార్థులకు ఒక్కక్కరికి రూ.1116 వంతున ప్రొత్సాహకాలు ఇస్తున్నారు. ఐసీఎల్ యజమాన్యం మొదటి మూడు స్థానాల విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు స్టడీ మెటీరియల్ అందజేస్తున్నారు. రెడ్డి సేవ సంఘం తరుపు మొదటి ఐదు స్థానాల విద్యార్థులకు నగదు పారితోషకం అందిస్తున్నారు.

ఆధునిక వసతులతో సుందరంగా మారిన పాఠశాల

గత వైఎస్సార్ ప్రభుత్వం హయాంలో నాడు–నేడు కార్యక్రమంలో మొదటి, రెండు విడతలలో పాఠశాలలో అన్ని సదుపాయాలు కల్పించారు. పాఠశాలలో చలువ గ్రానైటు బండలతో తరగతి గదులలో చప్పట వేశారు. అంతేకాక విద్యార్థులకు చక్కటి డస్కులు వేశారు.

రెండవ విడతలో అదనపు తరగతి గదులు నిర్మాణ పనులు జరిగాయి. వీటికి తోడు పూర్వ విద్యార్థులు వారికి తోచిన రితిలో పాఠశాలలో సదుపాయలు కల్పిస్తు సాయం అందిస్తున్నారు. ఈ ఏడాది నుంచి డిజిటల్ క్లాసులతో విద్యాబోధన జరుగుతుంది. విద్యార్థులకు శుద్దినీటిని కోసం ఆర్‌ఓ ప్లాంటును కూడా ఏర్పాటు చేశారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ..

పాఠశాలలోని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ద తీసుకుంటున్నాం. అందులో పదవ తరగతి చదివే వారికి ప్రతి రోజు ఉదయం ప్రత్యేక తరగతులు కూడా నిర్వహిస్తున్నాం. చదువులో వెనుక బడిన వారి పట్ల శ్రద్ద తీసుకుని వారి ఏ సబ్జక్టు కష్టంగా ఉంటుందో తెలుసుకుని బోధన చేస్తున్నాం. 2023–24లో ఐదు మందికి ట్రిపుల్‌ఐటీ వచ్చింది. అడ్మిషన్లు కూడా బాగనే వస్తున్నాయి. రుచికరమైన బోజనం కూడా పెడుతున్నాం.



– రామాంజనేయరెడ్డి, ప్రధానోపాధ్యాయులు జేడీపీ బాలుర పాఠశాల, ఎర్రగుంట్ల



ఉన్నత పాఠశాల



క్రీడలలో విద్యార్థులు సాధించిన పతకాలు

క్లుప్తంగా

నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూస్తాం



నీటి సమస్యను తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ రాముడు

పులివెందుల టౌన్ : పట్టణంలోని నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూస్తామని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. మంగళవారం స్థానిక మారుతి హాలు సమీపంలోని జనరేటర్ వీధిలో నీటి సరఫరా సమస్య ఉందని మున్సిపల్ కమిషనర్ తెలుసుకుని అక్కడ ఉన్న మోటార్‌కు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు కూడా నీటిని వృథా చేయకుండా సహకరించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మీభార్గవి, మున్సిపల్ డీఈ చిదానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి పరీక్షలు

సింహాద్రిపురం : గత నెల 17వ తేదీ నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమై మంగళవారం నాటితో ప్రశాంతంగా ముగిశాయి. పదవ తరగతి పరీక్షలకు రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. సింహాద్రిపురం ఉన్నత పాఠశాలలో 240 మంది, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 100 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షల రాశారు. మొత్తం 340 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా.. 337 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ ఓబులేసు తెలిపారు. అలాగే పరీక్షా కేంద్రాలను ఎస్ఐ తులసీ నాగప్రసాద్ పర్యవేక్షించారు.

రసవత్తరంగా ఎద్దుల పోటీలు

జమ్మలమడుగు : మైలవరం మండలం వద్దిరాల గ్రామంలోని సుంకులాంబ తిరునాల సందర్భంగా ఎద్దుల పోటీలను సోమవారం స్థానిక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలను తిలకించటానికి జమ్మలమడుగు, కర్నూల్ ప్రాంత ప్రజలతోపాటు వద్దిరాల చుట్టూపక్కల ప్రాంతాల రైతులు భారీ ఎత్తులో పాల్గొన్నారు.

సభలు, ధర్నాలకు అనుమతులు తప్పనిసరి

ఎర్రగుంట్ల : పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో సభలు, సమావేశాలు ధర్నాలు నిర్వహించుకోవాలంటే అనుమతులు తప్పనిసరి అని పట్టణ సీఐ నరేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. జిల్లా ఎస్పీ, జమ్మలమడుగు డీఎస్పీ వారి సూచనలు ఉత్తర్వుల మేరకు పట్టణంలో ఈనెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉందన్నారు. ఈ మేరకు ఏవరైన సభలు, సమావేశాలు, నిరసనలు, ధర్నాలు, ఊరేగింపులు నిర్వహించుటకు ముందస్తుగా అనుమతులు తీసుకోవాలన్నారు. లేకుంటే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు.

విందుకు హాజరు



విందుకు హాజరైన జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : మండలంలోని పందిళ్లపల్లెలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన విందుకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి హాజరయ్యారు. మంగళవారం పందిళ్లపల్లెలో నిర్వహించిన ముద్దల పండుగకు వైఎస్సార్ సీపీ నాయకులు శివకుమార్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, విశ్వానాథ్‌రెడ్డి ఆహ్వానం మేరకు ఆయన విచ్చేశారు. కార్యక్రమంలోవైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమా రెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, చెన్నకేశవ రెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, లక్ష్మీ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తే గుర్తింపు

కడప అర్బన్: బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించిన వారికి పదవీ విరమణ పొందినా గుర్తింపు ఉంటుందని జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్ అన్నారు. నగరంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇటీవల పదవీ విరమణ పొందిన పి.రాముడు, ఆర్.రాముడు, జి.చంద్రశేఖర్లను ఎస్పీ, సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో చేరినప్పటినుంచి ఇప్పటివరకూ శాంతి భద్రతల పరిరక్షణకు సేవలందిస్తూ పదవీ విరమణ పొందడం అదృష్టమన్నారు. పదవీ విరమణ పొందినవారంతా ఆ తర్వాత కూడా పోలీస్ కుటుంబంలో సభ్యులేనని, భవిష్యత్తులో ఎలాంటి సహాయం కావాలన్నా పోలీస్ శాఖ తోడుగా ఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ(అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు, ఏఆర్ ఏఎస్పీ బి.రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగకు దేహశుద్ధి



గ్రామస్థుల అదుపులో దోపిడికి పాల్పడిన యువకుడు

వీరపునాయునిపల్లె : దోపిడికి పాల్పడిన దొంగను గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. వివరాలలోకి వెలితే.. ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామానికి చెందిన వెంకటలక్షుమ్మ పింఛన్ కోసం కర్నూలు నుంచి కడపకు వచ్చి అక్కడి నుంచి వేంపల్లెకు చేరుకుని అక్కడి నుంచి వీరపునాయునిపల్లెకు ఆటో ఎక్కింది. అదే ఆటోలో చక్రాయపేట మండలం దేవరగుట్టపల్లెకు చెందిన కోలా జగదీష్ అనే యువకుడు ఎక్కాడు. ఆటో దిగిన ఆమె సచివాలయానికి వెళ్లి పింఛన్ నగుదును తీసుకుని వస్తుండగా ఆమెను వెంబడించిన ఆ యువకుడు ఆమె మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసును లాక్కోవడంతో ఆమె కేకలు వేయడంతో గ్రామస్తులు ఆ యువకుడిని వెంబడించి పట్టుకున్నారు. దోపిడి చేసిన 3 తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. విద్యుత్ స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. గత రెండు నెలల క్రితం వీరపునాయునిపల్లెలో కాయల నారాయణ రెడ్డి ఇంటిలో దోపిడికి పాల్పడింది కూడా ఈ యువకుడేనని వారు గుర్తించారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారణ చేపట్టారు.

మహాధర్నా జయప్రదం చేయాలి



మహా ధర్నా పోస్టర్లను విడుదల చేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు, అధ్యాపకులు

వేంపల్లె : ఈనెల 7, 8వ తేదీల్లో చేపట్టబోయే మహాధర్నాను జయప్రదం చేయాలని గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ హుస్సేన్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఇడుపులపాయలోని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలపై దృష్టి సారించి వెంటనే వీటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2017 గెస్ట్ ఫ్యాకల్టీకి ఏ విధమైన హోదాతో పాటు మార్పు జరిగిందో.. అదేవిధంగా తమ గెస్ట్ ఫ్యాకల్టీ నుంచి అసిస్టెంట్ లేదా లెక్చరర్‌గా మార్పు చేయాలన్నారు. అలాగే 2018 నుంచి సర్వీస్ కల్పించాలని, మిగతా అధ్యాపకుల మాదిరిగానే తమకు జీఓ 110 వర్తించేలా అమలు చేయాలన్నారు. అందుకు సంబంధించి ఆర్జీయూకేటీ పరిధిలోని అన్ని ట్రిపుల్‌ఐటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీలు రెండు రోజులపాటు జరిగే మహాధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. తమ సమస్యలపట్ల ఆర్జియూకేటీ యాజమాన్యం, ప్రభుత్వం స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ మహా ధర్నా నూజివీడు ట్రిపుల్‌ఐటీ ప్రధాన ద్వారం వద్ద చేపట్టడం జరుగుతుందన్నారు.

కార్పొరేషన్ల రుణాలు మంజూరు చేయాలి

పులివెందుల టౌన్ : ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల రుణాలు మంజూరు చేయాలని స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు పైడిపల్లి కిశోర్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఉన్న ఆర్డీఓ చిన్నయ్యను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీల కార్పొరేషన్లకు కేటాయించిన బడ్జెట్ వెంటనే విడుదల చేసి నిరుద్యోగ యువతీ యువకులను ఆదుకోవాలన్నారు. అలాగే రద్దు చేసిన సంక్షేమ పథకాలను అమలు చేయాలని, అలాగే ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌టీఎఫ్‌డీసీ ద్వారా అందించే రుణాలను మంజూరు చేసి యువతకు ఉపాధి మార్గాలు చూపాలన్నారు. భూమిలేని ప్రతి ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వమే 3 ఎకరాల చొప్పున భూమిని కొనుగోలు చేసి ఇవ్వాలన్నారు. అలాగే బ్యాంకులకు సంబంధం లేకుండా కార్పొరేషన్లే లబ్ధిదారులకు నేరుగా రుణాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. జిల్లాలలో ఎస్సీ, ఎస్టీల సముదాయ భవనాలను నిర్మించి ఉపాధి కల్పించాలన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు



విగ్రహ ప్రతిష్ఠకు ముస్తాబైన రామాలయం

వీరపునాయునిపల్లె : మండలంలోని కీర్తిపల్లె గ్రామంలో నేటి నుంచి శుక్రవారం వరకు సీతారామ లక్ష్మణ సమేత హనుమాన్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు గోపూజ, విశ్వక్షేన ఆరాధన, రక్షాబందం, అంకురార్పణ, వాస్తు హోమం తదుపరి తీర్థ ప్రసాద వినియోగం, రాత్రి 8 గంటలకు ఎర్రగుంట్ల లక్ష్మి మదనగోపాలస్వామి బృందం వారిచే కోలాటం, గురువారం ఉదయం 8 గంటలకు సుప్రబాత సేవ, గోపుర కలశ ప్రతిష్ట, రామతారక మూలమంత్ర హోమములు, లఘు పూర్ణాహుతి, దాన్యాదివాసము తదుపరి తీర్థ ప్రసాద వినియోగం, సాయంత్రం 5.30 గంలకు కళాన్యాస హోమములు, శ్రీ సూక్త, భూసూక్త, విష్ణుసూక్త మోమాదులు, శయ్యాది వాసములు, రాత్రి మద్యాహ్నం 2 గంటలకు గ్రామోత్సవం, రాత్రి 8 గంటలకు పాటకచేరి, శుక్రవారం వేకువజామున సుప్రభాత సేవ, యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, ధ్వజ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, బలిహరణం, మహా పూర్ణాహుతి, అభిషేకం, కుంభాభి షేకం, అర్చన, హారతి, తీర్థ ప్రసాద వినియోగం తదుపరి అన్న ప్రసాద వితరణతో కార్యక్రమాలు ముగుస్తాయని వారు తెలియజేశారు.

రామాయణ పఠనంతో జన్మ సార్థకం

కడప కల్చరల్: మహా కావ్యమైన రామయణాన్ని చదవడం, వినడం ద్వారా జన్మ సార్థకమవుతుందని ప్రొద్దుటూరుకు చెందిన స్వామిని శివ దర్శనానందరం సరస్వతీతీ మాత అన్నారు. కడప హౌసింగ్ బోర్డు కాలనీలోని కోదండ రామాలయంలో ఉగాది నుంచి జరుగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భాగంగా రామాయణంపై ఆమె వారం రోజుల పాటు ప్రవచించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రామాయణ రచనతో రత్నాకరుడైన ఆటవికుడు వాల్మీకి మహర్షిగా మారాడని తెలిపారు. ఈ రచన వల్ల ఆయన గొప్ప జ్ఞానిగా, తాత్వికుడిగా, తపస్విగా, మహర్షిగా పేరు గాంచారని వివరించారు. రామాయణాన్ని ఎందరో మహానుభావులు సంపూర్ణంగా అధ్యయనం చేసి మోక్షం పొందారన్నారు. ఈ సందర్భంగా తొలుత ఆలయ నిర్వాహకులు దేశు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మూలమూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం శేష వాహనంపై స్వామిని కొలువుదీర్చి ఊంజల్ సేవ చేశారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

నేటి నుంచి పాలిటెక్నిక్ ప్రవేశపరీక్షకు ఉచిత శిక్షణ

జమ్మలమడుగు రూరల్ : 10వ తరగతి పరీక్షలు వ్రాసిన విద్యార్థులకు పాలిటెక్నిక్‌లో ప్రవేశపరీక్షకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి పట్టణంలోని పతంగే రామన్నరావు ప్రభుత్వ హైస్కూల్‌లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రభుత్వ అధ్యాపకులచే శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాలిసెట్ పరీక్ష వ్రాసే విద్యార్థులకు ఉచితంగా ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. వివరాలకు సెల్ నెంబర్లు 7901620171, 9491407363, 9182720597 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

ఉలిమెల్ల రోడ్డులో గొడవ

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఉలిమెల్ల గ్రామం నుంచి విశ్వనాథరెడ్డి, కోడలు మాధవిలు మంగళవారం ద్విచక్రవాహనంలో పులివెందులకు వస్తుండగా, అదే రూట్‌లో పవన్‌కుమార్‌రెడ్డి, మణిలు వేగంగా ద్విచక్రవాహనంలో పులివెందులకు వేంగంగా వస్తుండటంతో అంత వేగంగా ఎందుకు వెళుతున్నారని విశ్వనాథరెడ్డి వారిని మందలించారు. దీంతో వారు విశ్వనాథ్‌రెడ్డిపై డాడిచేశారు. అలాగే ఆదేదారిలో పోతున్న సుబ్బారెడ్డి, చంద్రశేఖరరెడ్డిలు ఎందుకు గొడవ పడుతున్నారని పవన్‌కుమార్‌రెడ్డి, మణిలను అడుగగా వీరిని కూడా వారు కొట్టారు. దెబ్బలు తిన్న వారు అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ధర్నా చేసేందుకు ప్రయత్నించారు. సీఐ నరసింహులు గొడవ విషయమై జోక్యం చేసుకుని గాయపడిన విశ్వనాథరెడ్డి, మాధవిలను చికిత్స కోసం పులివెందుల వైఎస్సార్ సర్వజన ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా కుందేళ్ల పార్వేట

లింగాల : ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని లింగాలలో కుందేళ్ల పార్వేట ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా సాగుతోంది. ప్రతి ఏటా పండుగ రోజున యువకులు అడవికి వెళ్లి వలలు వేసి కుందేళ్లను ప్రాణాలతో పట్టుకుని తీసుకొచ్చారు. పార్ణమి రోజు ఎగువ లింగాల రామాలయం నుంచి డప్పులు, మేళాలతో సీతారామ, లక్ష్మణ ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి పట్టుబడిన కుందేళ్లను ఊరేగింపుగా గ్రామ సమీపంలోని పొలాల్లోకి తీసుకెళ్లారు. మహిళలు, పురుషులు, పిల్లలు భారీ సంఖ్యలో ఈ పార్వేటలో పాల్గొన్నారు. ప్రజల మధ్య కుందేళ్లను పట్టుకుని వదిలేస్తారు. వాటిని పట్టుకునేందుకు పిల్లలు, యువకులు పరుగులు తీసి వాటిని పారిపోకుండా తిరిగి పట్టుకుంటారు. ఈ విధంగా చేయడంవల్ల వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండుతాయని ఇక్కడి ప్రజల ప్రగాఢ నమ్మకం. కుందేళ్ల పార్వేట అనంతరం మహిళలకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగపు నియోజకవర్గ కన్వీనర్ సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, గ్రామ పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

తొండూరులో..

తొండూరు : ఉగాది పార్ణమి పండుగను పురష్కరించుకుని వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం స్థానిక గ్రామాల్లో ఉన్న అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి జంతువులను బలి ఇచ్చి బోనాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం బంధువులు, స్నేహితులకు విందు భోజనాలు ఏర్పాటు చేసి సంతోషంగా జరుపుకున్నారు.



కుందేళ్ల పార్వేట ఉత్సవంలో పాల్గొన్న ప్రజలు



కబడ్డీ ఆడుతున్న మహిళలు



కుందేళ్లను చూపుతున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగపు నియోజకవర్గ కన్వీనర్ సారెడ్డి చంద్రశేఖరరెడ్డి

యువకుల మధ్య ఘర్షణ



యువకులతో మాట్లాడుతున్న అర్బన్ సీఐ నరసింహులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఇస్లాంపురంలో మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో కొంత మంది యువకులు ఘర్షణ పడ్డారు. నగరిగుట్టకు చెందిన కొంతమంది యువకులు, ఇస్లాంపురం చెందిన మరికొంతమంది యువకులు ఘర్షణ పడి గొడవపడ్డారు. యువకులంతా గంటపాటు కొట్టుకోవడంతో పులివెందుల అర్బన్ సీఐ నరసింహులు ఆధ్వర్యంలో ఇస్లాంపురం చేరుకుని ఘర్షణ పడుతున్న వారందరిని చెల్లాచెదురు చేశారు. దీంతో కొద్ది సేపు ఇస్లాంపురంలో ఏమి జరుగుతుందో తెలియక ప్రజలందరూ భయాందోళన చెందారు. పట్టణంలో చాలా చోట్ల యువకులందరూ మత్తు పానీయాలు సేవించి గొడవలకు పాల్పడుతున్నట్లు సమాచారం. పట్టణంలో రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు ఎక్కడ ఏమి జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

కమలాపురం : కమలాపురం మండలం కోగటం గ్రామ సమీపంలోని ముళ్ల పొదల్లో జూదమాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ప్రతాప్ రెడ్డి తెలిపారు. మంగళవారం జూదమాడుతున్న సమాచారం అందుకున్న ఎస్ఐ సిబ్బందితో కలసి జూద స్థావరంపై దాడి చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.13,220 నగదుతో పాటు పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని రిమాండ్‌కు తరలిస్తామని ఎస్ఐ వివరించారు.

యామవరంలో చోరీ యత్నం

ముద్దనూరు : మండలంలోని యామవరం గ్రామంలో చోరీయత్నం జరిగినట్లు పోలీసులు మంగళవారం గుర్తించారు. సంఘటన వివరాలు ఇలా వున్నాయి. గ్రామంలోని లక్ష్మీదేవి అనే మహిళ గత నెల 23వ తేదీన ఇంటికి తాళం వేసి ఎర్రగుంట్లలోని తమ కుమార్తె వద్దకు వెళ్లింది. తిరిగి తన కుమార్తె వద్ద నుంచి మంగళవారం ఇంటికి వచ్చిచూడగా ఇంటి తలుపు తాళము పగలగొట్టినట్లు గుర్తించింది. ఇంటిలోకి వెళ్లి బీరువాను పరిశీలించింది. బీరువా తలుపులు పగలగొట్టడానికి ప్రయత్నంచేసినట్లు తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

బీరువా తలుపులు పగలగొట్టడానికి ప్రయత్నించినట్లు గుర్తించిన పోలీసులు బీరువాను తెరిపించారు. అయితే బీరువాలో వున్న రూ.10 వేలు నగదు, ఇతర డాక్యుమెంటు అలాగేవున్నట్లు గుర్తించారు. బీరువాను పగలగొట్టడానికి ప్రయత్నించిన దొంగలు అది సాధ్యం కాకపోవడంతో వెనుతిరిగినట్లు తెలుస్తోంది.

108 సేవలు.. మూన్నాళ్ళ ముచ్చటేనా

ముద్దనూరు : స్థానిక 108 వాహన సేవలు సుమారు నెలరోజులుగా ప్రజలకు అందుబాటులో లేవు. గత నెల 1వ తేదీన మరమ్మతుల కోసం 108 వాహనాన్ని తరలించారు. అనంతరం 108 వాహనం గత నెల 28వ తేదీన అందుబాటులోకి వచ్చింది. అయితే ఈ సేవలు మూనాళ్ళ ముచ్చటగానే మిగిలిపోయాయి. మూడురోజులు సేవలందించిన అనంతరం మళ్ళీ మరమ్మతులు రావడంతో 108 వాహనాన్ని తిరిగి షెడ్డుకుచేర్చారు. జాతీయరహదారి, పలుప్రాంతాలకు కూడలిగా వున్న ముద్దనూరు పరిసరప్రాంతాల్లో ఆపదల్లో వున్న వారికి నిత్యం 108 వాహనం అవసరం అవుతోంది. ఉన్నతాధికారులు స్పందించి 108 వాహనం నిత్యం అందుబాటులో వుండేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



ముద్దనూరు 108 వాహనం(ఫైల్)

సకాలంలో సర్వేలు పూర్తి చేయాలి

వల్లూరు : వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణాధికారి రవిబాబు తెలిపారు. వల్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సచివాలయాల ఏఎన్ఎంలకు మంగళవారం జరిగిన నెలవారీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్‌సీడీ, క్యాన్సర్, డెంటల్, పీఎంజేవై, సికిల్ సస్ వ్యాధులపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు సర్వేను పూర్తి చేయాలన్నారు. టీబీ, లెప్రసీ కేసులకు సంబంధించి పాపులేషన్‌కు తగినట్లు సర్వే చేయాలన్నారు. పీహెచ్‌సీలో జరుగుతున్న కాన్పులు, సేవలను గురించి ఆరా తీశారు. అనుమానాస్పద కేసులను రెఫర్ చేయాలని సూచించారు. ఎండాకాలంలో వచ్చే విరేచనాలు, డెంగీ వంటి వ్యాధుల గురించి వివరించారు. గర్భిణలకు, బాలింతలకు, పిల్లలకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సరైన సేవలు అందించాలని తెలిపారు. సకాలంలో గర్భిణుల వివరాలను నమోదు చేసి, వారికి టీటీ, ఐరన్ టాబ్లెట్లు ఇవ్వడమే కాక 4 హెల్త్ చెకప్స్ పూర్తి చేయించాలని, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో ఇవ్వాలని ఆదేశించారు. ఐరన్, విటమిన్ ఏ సరఫరా చేయాలని సూచించారు. ప్రతి గర్భిణికి ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు అయ్యేలా వారికి అవగాహన కల్పించడంతో పాటు 108 సేవలు గురించి, 102 సేవలు గురించి వివరించాలని సూచించారు. చిన్నపిల్లలకు ఎండా కాలంలో తట్టు, అమ్మవారు, విరోచనాలు వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు వుంటాయని, వాటిపై అవగాహన కల్పించాలన్నారు. పనులకు పోయే వాళ్లు ఎండాకాలంలో 10 గంటల లోపల పనులు ముగించుకుని నీడ పాటు చేరాల్సిన అవసరాన్ని వివరించాలన్నారు. ఆశా వర్కర్ల వద్ద, అంగన్‌వాడీ సెంటర్స్, స్కూల్స్‌లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు ఫణీంద్ర, సీహెచ్‌వో వేణుగోపాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న వైద్యాధికారి రవిబాబు